క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో కొత్త 8.0ఎంవీఏ పీటీఆర్‌ను ఏర్పాటు చేయడం వల్ల గురు, శుక్రవారాలు రెండు రోజుల్లో లైన్ క్లియరెన్స్ కోసం విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ నవీన్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ పట్టణంతో పాటు మండల పరిధిలోని పర్సాపూర్, చిట్లపల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి, ఉడిమేశ్వరం, మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట, పాతకొడంగల్, బూల్కాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

హుండీ ఆదాయం రూ.5 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

తాండూరు రూరల్: మండలంలో కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర వైభవంగా సాగింది. గత నెల రోజుల నుంచి జరిగిన జాతరలో తాండూరు ప్రాంతంతో పాటు కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గత శుక్రవారంతో జాతర ముగిసింది. బుధవారం ఆలయంలో అధికారులు, గ్రామస్తులు అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.5 లక్షల 24 వేల 594 ఆదాయం వచ్చినట్లు ఈఓ శేఖర్‌గౌడ్ తెలిపారు. కొంతమంది భక్తులు అమ్మవారికి బంగారం, వెండి కానుకలు సమర్పించారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలకు స్వాగతం


జీహెచ్‌ఎంలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు నూతనంగా నియమితులైన జీహెచ్‌ఎంలకు బుధవారం మండల ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రాంరెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి స్వాగతం పలికారు. సన్మానం పొందినవారిలో చౌదర్‌పల్లి రవీందర్‌గౌడ్, హకీంపేట నరేందర్, కుదురుమళ్ల ప్రతాపరెడ్డి, దుద్యాల విజయరామారావులు న్నారు. ఇందులో ఉపాధ్యాయుల సంఘాల నాయకులు రవీందర్‌గౌడ్, గోపాల్, జలంధర్‌రెడ్డి, నోడల్ అధికారి హరిలాల్ ఉన్నారు.

పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండ


ఎల్‌ఓసీ పత్రాలు ఇస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్ : సీఎం సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితుల కుటుంబ సభ్యులకు బుధవారం ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి అండగా ఉంటామన్నారు. బాధితుల వైద్య పరీక్షల నిమిత్తం ఆసరాగా ఉంటుందని సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను అందించినట్లు చెప్పారు. దౌల్తాబాద్‌కు చెందిన రవికి ఆరోగ్య పరీక్షల కోసం రూ.2 లక్షలు, బొంరాస్‌పేట మండలానికి చెందిన అంజయ్యకు రూ.లక్షా 20వేలకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న కెఎన్‌పీఎస్ నాయకులు

కొడంగల్ రూరల్ : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన మహిళను చిత్రహింసలకు గురిచేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కెఎన్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఇందనూర్ అంజి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. దంపతులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ, చాలీచాలని బతుకీడుస్తున్న కుటుంబంపై దౌర్జన్యాలకు పాల్పడిన దుండగులను పోలీసులు కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇందులో కెఎన్‌పీఎస్ మండల సహాయ కార్యదర్శి మహేష్, సభ్యులు ఆనంద్, పకీరప్ప, నర్సిములు, వెంకటయ్య పాల్గొన్నారు.

కర్రంటు కష్టాలు


కట్టెలపైనే విద్యుత్తు వైర్లు

'కాలం మారినా కరెంట్ కష్టాలు మాత్రం తీరడం లేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మారుమూల ప్రజానీకం ఇప్పటికీ దినదిన గండంగానే జీవించాల్సిన పరిస్థితి. మారుమూల పల్లెలు, గిరిజన తండాలకు అధికారులు వెళ్లేదే తక్కువ.. అందులో సమస్యలుంటే నత్తనడకన పరిష్కారమవుతాయి. కుల్కచర్ల మండల పరిధిలోని గిరిజన ఆవాసాల ప్రజానీకం విద్యుత్తు సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.'

- చేతికందేలా విద్యుత్తు వైర్లు
- డీడీలు కట్టినా అందని పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇబ్బందులకు గురవుతున్న రైతులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

కుల్కచర్ల: సర్కారు పనులంటేనే ఆలస్యం.. అందులో కరెంట్ పనులంటే మరింత ఆలస్యమన్నది నానుడిగా మరింది. నెలల తరబడి విద్యుత్తు సమస్యలు పరిష్కారానికి నోచుకోక, ఇబ్బందుల మధ్యనే రైతాంగం వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన పరిస్థితి గ్రామాల్లో దాపురించింది. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు పరిష్కారానికి నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

చేతికందేలా వైర్లు

మండల పరిధిలోని చెరువుముందలి తండాలో గత కొన్ని నెలలుగా విద్యుత్తు వైర్లు కిందకు వేలాడుతున్నాయి. గ్రామ పరిధిలో పొలాల వద్ద విద్యుత్తు వైర్లు పశువులకు తాకేలా ఉండటంతో వాటికి కావలి ఉండలేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే రానున్నది వర్షాకాలం వైర్లు మరింత కిందికి వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు.

డీడీలు కట్టినా అందని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

చౌడాపూర్ మండలం కొత్తపల్లి, బంగ్రంపల్లి గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో స్తంభాలతో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసుకునేందుకు గత సంవత్సరం ఆగస్టులో డీడీలు కట్టారు. కానీ, ఇప్పటి వరకు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు స్తంభాలకు బదులు కట్టెలపైనే వైర్లను లాక్కొని వినియోగించుకుంటున్నారు. పశువులు తాకడం, గాలివానకు ఏ ప్రమాదం జరుగుతోందనని అందోళన చెందుతున్నారు.


చేతులకందే ఎత్తులో కరెంట్ వైర్లు

స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదు



పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోనేందుకు డీడీలు కట్టాం. ఇప్పటివరకు ఇవ్వలేదు. దీంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నాం. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సున్నల రాంచంద్రయ్య, కొత్తపల్లి

కర్రలే విద్యుత్ స్తంభాలు..



పొలాలకు విద్యుత్తును పొందేందుకు స్తంభాలు ఇవ్వకపోవడంతో కట్టెలపై వైర్లను వేసుకుని కరెంట్‌ను వినియోగించుకుంటున్నాం. వర్షాకాలం గాలివానలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు మా ఆవేదనను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలి.

– సోనమోని లక్ష్మయ్య, బంగ్రంపల్లి గ్రామం

ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తాం



వర్షాకాలం నేపథ్యంలో లూజ్ కనెక్షన్లను సరిచేయాల్సిందిగా లైన్‌మెన్లకు సూచనలు చేస్తున్నాం. ఒకటిరెండు రోజుల్లో మండలానికి స్తంభాలు రావాల్సిన ఉంది. వచ్చిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను కూడా అందిస్తాం.

– ఎండీ. హైమద్, ట్రాన్స్‌కో ఏఈ

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ

- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం
- ప్రతీ గ్రామంలో మౌలిక నదుపాయాలు
- జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి

బషీరాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏకకాలంలో వడ్డీతో సహా రూ.2 లక్షల రుణ మాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం బషీరాబాద్ ఎంపీపీ కరుణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు హామీల్లో 5 హామీలు అమలు అవుతున్నాయన్నారు. మరోవైపు జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా మూడుసార్లు ప్రజలకు సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. జిల్లాతో పాటు తాండూరు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినా కొందరికి కనిపించడం లేదని విమర్శించారు. అంతకు ముందు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఇన్నాళ్లు ప్రజలకు చేసిన సేవలు మరిచిపోలేనివని అన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం...

ప్రజాప్రతినిధుల పదవీ కాలం జూలై 3న ముగియనుండడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలు మండల పరిషత్ అధికారులు ఘనంగా సన్మానించారు. అలాగే,సునీతారెడ్డి,మనోహర్‌రెడ్డిని సన్మానించారు.


ఎంపీటీసీలతో సునీతారెడ్డి, మనోహర్‌రెడ్డి

రూ.35 లక్షల పనులకు శంకుస్థాపన..

మండలంలోని మర్పల్లి గ్రామంలో రూ.35 లక్షల అభివృద్ధి పనులకు జెడ్పి చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శిలాఫలకం వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులో ఉన్న బుగ్గరమేశ్వరాన్ని అభివృద్ధి చే స్తానని అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటీసీ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ అన్నపూర్ణ, నాయకులు వెంకటేశ్ మహరాజ్, మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీడీ ఓ, తహసీల్దార్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని అభయాంజనేయస్వామివారి ఆలయ సమీపంలోని అక్షర హైస్కూల్‌లో 30న (ఆదివారం) సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు భజన మండలి సభ్యులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్‌లోని శంకర కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తూ మందులను అందించనున్నట్లు తెలిపారు.

దళితులపై దాడులు సరికాదు

అనంతగిరి: జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పలువురు దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డికి దళిత సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నవాబ్‌పేట మండలం గంగ్యాడలో దళితుడిని దూషించిన సదరు వ్యక్తిని పోలీసులు ఇప్పటివరకు రిమాండ్‌కు తరలించలేదన్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరాజు, జిల్లా అధ్యక్షుడు గాలయ్య, ప్రగతిశీల జిల్లా కన్వీనర్ గీత, ఐక్యవేదిక కన్వీనర్ జగదీష్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఆనందం పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో సవరణలకు అవకాశం

అనంతగిరి: ప్రభుత్వ డైట్, ప్రైవేట్ డైట్ కళాశాలలో 2024–26 రెండు సంవత్సరాల డీఎడ్ కోర్స్ తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియాల్లో అడ్మిషన్ల కోసం డీసెట్ ఎంట్రన్స్ రాయుటకు ఈనెల 8నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడం కోసం ఈనెల 29, 30 తేదీల్లో సవరణలకు అవకాశం ఇవ్వడం జరిగిందని వికారాబాద్ డైట్ ప్రిన్సిపల్ రామాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావునా, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి


కుర్చీలు అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: విద్యావ్యవస్థ ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు 10కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పించాలనే ఉద్దేశంతో కాకుండా మన వంతుగా ఎంతో కొంత సహాయం చేయాలన్నారు. అనంతరం కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. మన పాఠశాలలో మన పరిధిలోని చిన్నారులే చదువుకుంటారని కావున వారికి మన సహాయం ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజశేఖర్, నర్సింలు, కృష్ణ, సత్యయ్య, మొగులయ్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

బీజెవైఎం డిమాండ్

తాండూరు టౌన్ : విద్యాశాఖా మంత్రిని వెంటనే నియమించాలని బీజెవైఎం పట్టణ అధ్యక్షుడు తాండ్ర నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు గడుస్తున్నా విద్యాశాఖా మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల విద్యావ్యవస్థలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖా మంత్రిని నియమించి విద్యావ్యవస్థను గాడిలో నడిపించాలని కోరారు. సమావేశంలో బీజెవైఎం ఉపాధ్యక్షుడు రాఘవేందర్, అంబదాస్, అశోక్, శ్రీనివాస్, ఆదర్శ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న నరేష్

ఘనంగా సాహుమహారాజ్ జయంతి


సాహుమహారాజు జయంతిలో నాయకులు

పరిగి: పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి సాహుమహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. దేశంలో బ్రాహ్మణులు రాసిన మనుధర్మ శాస్త్రానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి సాహు అన్నారు. దేశంలో మొదటి సారిగా రిజర్వేషన్లను కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో గట్యానాయక్, వెంకటయ్య, ముకుందనాగేశ్వర్ పాల్గొన్నారు.

సాహు మహరాజ్ జయంతి వేడుకలు

తాండూరు టౌన్ : సాహు మహరాజ్ జయంతిని పురస్కరించుకుని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మా ట్లాడుతూ.. జ్యోతిబా పూలే వల్ల శూద్రకులాల వారు విద్యను ఆర్జించగా, రిజర్వేషన్లను కల్పించి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మహరాజ్‌కే దక్కిందన్నారు.

మూడు నెలలకే మూలకు..

పెద్దేముల్: ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ్ యోజన పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన చిన్నారుల ఆట వస్తువులు మున్నాళ్లకే మూలకు చేరాయి. మండలంలోని సుమారు 50 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.లక్షలతో నాలుగు నెలల క్రితం పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. కాని, అవి నాసికరంగా ఉండటంతో మున్నాళ్లకే మూలకు చేరాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని తట్టెపల్లి పాఠశాలల్లో బిగించిన ఆట వస్తువులకు సిమెంట్ ఊడిపోవడంతో వాటిని పాఠశాల సిబ్బంది పక్కన పెట్టారు. మరికొన్ని పాఠశాలల్లో ఊగే ఉయ్యాలకు గొలుసులు పాడైనట్లు సమాచారం. చేసినా పనులు నాసిరకంగా ఉండటంతో మూలకు చేరుకుంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై మండల పంచాయతీ రాజ్ ఏఈ సిద్ధార్థను వివరణ కొరగా మండలంలోని పాఠశాలల్లో ఎక్కడైన బిగించిన ఆట వస్తువులు పాడైన, సంబంధిత కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.


పక్కన పెట్టిన చిన్నారుల ఆట వస్తువు

త్వరగా పనులు పూర్తి చేయండి

మండల ప్రత్యేకాధికారి సౌజన్య


సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

మోమిన్‌పేట: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో 'అమ్మ ఆదర్శ' పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సౌజన్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే చాలా పాఠశాలలో పనులు పూర్తయ్యాయని.. అక్కడక్కడ కొన్ని పనులు మిగిలిపోయాయని అన్నారు. మరికొన్ని పాఠశాలల్లో సగం పనులు మాత్రమే పూర్తి చేసినట్లు చెప్పారు. పనుల నిర్వహణలో జాప్యంపై అసహనం వ్యక్తం చేసింది. కార్యదర్శులు పాఠశాలలను పర్యవేక్షించి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు కల్గితే ప్రధానోపాధ్యాయులే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి, పీఆర్ఏఈఈ ప్రణీత్‌కుమార్, ఎంఇఓ గోపాల్, ఏపీఎం రాజు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు ఉన్నారు.

లక్ష్య సాధనతో ముందుకు..

సీఎస్‌బీఐ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత

తాండూరు టౌన్ : విద్యార్థులు లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలని హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌బీఐ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. బుధవారం పట్టణంలోని జగదాంబ టవర్స్‌లో బుయ్యని సరళా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలలత మాట్లాడుతూ.. భవిష్యత్‌లో విద్యార్థులు నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు కృషి, పట్టుదల ఎంతో అవసరమన్నారు. ప్రణాళిక ప్రకారం, నైపుణ్యంతో పరీక్షలకు ప్రిపేర్ అయితే సులభంగా విజయం సాధించవచ్చన్నారు. మీరు తీసుకునే ప్రతి నిర్ణయం, మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. లక్ష్యం ఉన్నతంగా ఉండటంతో పాటు, సాధన సైతం అదేస్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఆర్‌టీబీఎల్ సీఈఓ శ్రీనివాస్ రెడ్డి, బుయ్యని సరళ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలలత

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేశ్

పరిగి: ప్రైవేటు పాఠశాలలు చేస్తున్న ఫీజుల దోపిడీని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిగణేష్ మండిపడ్డారు.బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయాల ఫీజులు వసూలు చేస్తూ విద్యను దోపిడీ చేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాలల సమస్యలను పరిష్కరించాలన్నారు. పక్కా భవనాల లేక వసతిగృహాలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు చాలీచాలని వసతులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జగదీశ్‌చారి, అనిల్, మురళి, రాజేందర్, ఆదికేశవరెడ్డి, కార్తీక్, శ్రీదర్, సునీల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

తాండూరు టౌన్ : ప్రైవేటు పాఠశాలలు పూర్తి స్థాయిలో బంద్ పెట్టినప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఏబీవీపీ కార్యకర్తలు తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలు విద్యను వ్యాపారంగా మార్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు విక్రయాలతో వ్యాపారం చేస్తున్నాయన్నారు. అడ్డూ అదుపు లేకుండా వేలు, లక్షల్లో ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని వాపోయారు. బంద్‌లో ఏబీవీపీ నాయకులు పవన్, అజయ్, దినేష్, వంశీ, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.


పరిగి: బంద్ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

నోట్ బుక్స్ పంపిణీ

దోమ: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. చదువుతో మంచిచెడులపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్‌యాదవ్, దోమ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజనేయులుగౌడ్, ఉపాధ్యాయులు వెంకటేశ్, అంగన్‌వాడీ సిబ్బంది నిర్మల, స్థానికులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

తాండూరు టౌన్: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ, రూరల్ సీఐలు సంతోష్ కుమార్, అశోక్, పలు కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిఁచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి వంటి నిషేధిత పదార్థాలు వినియోగించడం, విక్రయించడం నేరమన్నారు. యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు పోయి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా 8712671111 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

నవసమాజ నిర్మాణానికి కృషి

పరిగి: గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలించి నవసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పరిగి సీఐ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను సేవించడంతో యువత బంగారు భవిష్యత్తును కోల్పోతుందన్నారు. మత్తుకు బానిసై ఆరోగ్యం క్షీణిస్తుందని చెప్పారు. గంజాయిని విక్రయించిన, సేవించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సంతోష్‌కుమార్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ర్యాలీలో పాల్గొన్న తాండూరు డీఎస్పీ, సీఐలు


పరిగి: ర్యాలీలో పాల్గొన్న సీఐ తదితరులు